క్లుప్తంగా

చిరుధాన్యాల సాగుపై అవగాహన



వరహాపురం(వేమూరు): చిరు ధాన్యాలను ఆహారంలో ఒక భాగంగా చేసుకొని ఆరోగ్యాన్ని కాపాడు కోవాలని ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ ఆర్.బాల మురళీధర్ నాయక్ చెప్పారు. వేమూరు మండలంలోని వరహాపురం గ్రామంలోని రైతులకు చిరుధాన్యాల సాగులో మెళకువలపై శిక్షణా కార్యక్రమం గురువారం నిర్వహించారు. రైతులంతా చిరు ధాన్యాల సాగుకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ యల్లమాటి స్వాతి, శాస్త్ర వేత్తలు డాక్టర్ జె రాధాకృష్ణ, యం ఉష, డీఆర్‌సీ విజయ నిర్మల, మండల వ్యవసాయాధికారి సీహెచ్ సునీత, దీప్తి, రైతులు పాల్గొన్నారు.

సీఐటీయూ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం



బాపట్ల: రక్తదానంతో అనేక మందిని ప్రాణాపాయం నుంచి కాపాడవచ్చని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సీహెచ్ మజుందార్ అన్నారు. గురువారం సీఐటీయూ బాపట్ల జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ప్రజా సంఘాల కార్యాలయంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. మజుందార్ మాట్లాడుతూ రక్త దానం చేయడం వల్ల ఆరోగ్యానికి ఎంతో మంచిదన్నారు. ప్రతి ఆరు నెలలకు ఒకసారి రక్తదానం చేయవచ్చని అన్నారు. సీఐటీయూ కార్మిక వర్గ సమస్యలతో పాటు సమాజ శ్రేయస్సుకు కూడా పాటు పడుతుందన్నారు. శిబిరంలో సీఐటీయూ కార్యకర్తలు రక్తదానం చేశారు. బాపట్ల ప్రభుత్వ ఏరియా వైద్యశాల వైద్యులు, సిబ్బంది రక్తాన్ని సేకరించి ఆసుపత్రి బ్లడ్ బ్యాంకుకు తరలించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు కె.శరత్, బాపట్ల పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు ఓ లక్ష్మణ్, జె శామ్యూల్, రాజారావు, చిన్ని, మురళి, ఐద్వా నాయకులు టి. సుభాషిణి పాల్గొన్నారు.

ఎమ్మార్పీ ధరలకే విత్తనాలు విక్రయించాలి

కొలకలూరు(తెనాలి): మండలంలోని విత్తన డీలర్లు విత్తనాలను ఎమ్మార్పీ ధరలకే విక్రయించాలి, రైతులకు తప్పనిసరిగా బిల్లులు ఇవ్వాలని మండల వ్యవసాయ అధికారి జి.ప్రేమసాగర్ స్పష్టం చేశారు. నిబంధనలను అతిక్రమిస్తే క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. డీలర్లు అంతా నిబంధనలకు లోబడి వ్యాపారం చేయాలన్నారు. రూరల్ మండల గ్రామం కొలకలూరులోని రైతు భరోసా కేంద్రంలో గురువారం రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రేమసాగర్ మాట్లాడుతూ రైతులు విత్తనాలను విత్తేముందు విత్తన మొలకశాతం కట్టాలని సూచించారు. వంద విత్తనాలకు 80 పైగా విత్తనాలు మొలకెత్తితే అది మంచి విత్తనమని నిర్ధారించుకుని విత్తాలని సూచించారు. ఆ విధంగా లేకుంటే సంబంధిత విత్తన బ్యాగ్‌ను రిటర్న్ చేయాలని సలహానిచ్చారు. భూసార పరీక్షల కోసం రైతు భరోసా సిబ్బంది మట్టి నమూనాలను సేకరిస్తున్నారని చెప్పారు. ఎరువుల కోసం ఆర్‌బీకేలను వినియోగించుకోవాలని చెప్పారు. గ్రామ సర్పంచ్ సీహెచ్ ప్రీతి అశోక్‌కుమార్ మాట్లాడుతూ రైతులు వ్యవసాయశాఖ ద్వారా వ్యవసాయానికి సంబంధించిన ఎరువులు, విత్తనాలను తీసుకోవాలని సలహానిచ్చారు. వ్యవసాయ సిబ్బంది రైతులకు అందుబాటులో ఉండాలన్నారు. సదస్సులో వీఏఏలు నాగరాజు, నాగేంద్ర, శివతేజ, వీఆర్‌ఓ నితీష్‌కుమార్, రైతులు గుంటూరు కృష్ణమోహన్, ఆరంబాక నాగేశ్వరరావు, తాడిబోయిన చంద్రశేఖర్, గుమ్మడిదల సుబ్బారావు, తాళ్లూరి వెంకట్రావు, పూనంశెట్టి రఘు రామయ్య తదితరులు పాల్గొన్నారు.

దేశం ఎదుర్కొనే సమస్యలపై చర్చ జరగాలి

లక్ష్మీపురం: రాజకీయాలను పక్కన పెట్టి.. దేశం ఎదుర్కొనే సమస్యలపై 18వ లోక్ సభలో చర్చ జరిగేలా చూడాలని విశ్లేషకులు ఆర్.వి సింగరయ్య పేర్కొన్నారు. స్థానిక అరండల్ పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన చర్చ గోష్ఠి కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మంచికో, చెడుకో ఇవాళ దేశ ప్రజలు రెండు కూటముల వైపే మొగ్గు చూపారని ఎన్డీయే కూటమి, ఇండియా కూటమిలో భాగం కాని పార్టీలను ప్రజలు దాదాపు తిరస్కరించారన్నారు. భారత దేశం రెండు రాజకీయ శిబిరాల మధ్య విభజితమైందని, అయితే రాజకీయాలకే పరిమితం కాదని అభివృద్ధి నుంచి ప్రజా సమస్యల వరకూ అవలంబించాల్సిన సైద్ధాంతిక దృక్పథానికి సంబంధించినదనే స్పష్టమవుతుందన్నారు. సంస్థ కార్యదర్శి కొండాశివామిరెడ్డి, ఏపీ లీగల్ ఫోరం కన్వీనర్ అవధానుల హరి మాట్లాడుతూ 17వ లోక్ సభలో అనేక అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకున్నాయన్నారు. అనేక ముఖ్యమైన బిల్లులు చర్చలు లేకుండానే ఆమోదమయ్యాయని బడ్జెట్ ప్రతిపాదనలపై చర్చ సక్రమంగా జరగలేదన్నారు. 18వ లోక్ సభ కాలంలో గత సమావేశాల నాటి సంక్లిష్ట పరిస్థితులు పునరావృత్తం కాకుండా చూడాలన్నారు. అనంతరం సంస్థ సభ్యులు తదితరులు ప్రసంగించారు.

సేవాభావం.. స్ఫూర్తి దాయకం

మానవ సేవే మాధవ సేవగా భావిస్తూ 'నాన్నగారు' స్వచ్ఛంద సేవా సంస్థ నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలు పలువురి మన్ననలు పొందుతున్నాయి. అనాథలను, అన్నార్తులను అక్కున చేర్చుకుని వారికి అండగా నిలుస్తోంది. కరోనా లాక్ డౌన్ సమయంలో ఎందరో ఆకలితో అలమటించారు. కొందరు ఈ మహమ్మారి బారిన పడి మరణించారు. ఇలాంటి విపత్కర పరిస్థితుల్లో 'నాన్నగారు' స్వచ్ఛంద సేవా సంస్థ ముందుకు వచ్చింది. బాధితులను ఆదుకోవటమే కాక కరోనా మహమ్మారి బారిన పడి మరణించిన మృతులకు సొంతవాళ్లే దూరమైన వేళ.. అంతిమ సంస్కారాలు గావించింది. 'పరోపకారార్థం మిదం శరీరం' అన్న ఆర్యోక్తికి జీవం పోస్తోంది.

- ఆపన్నులకు అండగా నిలుస్తున్న 'నాన్నగారు' స్వచ్ఛంద సేవా సంస్థ
- కరోనా విపత్కర సమయంలోనూ అనాథలకు నిత్యం అన్నదానం
- కరోనా మృతులకు అంతిమ సంస్కారాలు
- అభాగ్యులకు అన్నీ తానై నిలుస్తున్న సంస్థ వ్యవస్థాపకుడు సత్యన్నారాయణ



అన్నార్తుల ఆకలి తీరుస్తున్న పొన్నపల్లి సత్యన్నారాయణ(ఫైల్)



కరోనా సమయంలో అనాథ శవానికి దహన సంస్కారాలు (ఫైల్)

భట్టిప్రోలు: గుళ్లపల్లికి చెందిన పొన్నపల్లి వెంకట సుబ్రహ్మణ్యం దాతగా, సేవా తత్పరుడిగా పేరు గాంచారు. తన ఇంటి వద్దకు వచ్చి సాయం కోరినదే తడవుగా అభాగ్యులను ఆదుకుని అండగా నిలిచేవారు. ఆయన కుమారుడైన పొన్నపల్లి సత్యన్నారాయణ తన తండ్రి అడుగుజాడల్లోనే నడవాలని నిర్ణయించుకున్నారు. సుబ్రహ్మణ్యం 2002లో మరణించిన తర్వాత ఆయన ఆశయాలను కొనసాగిస్తూ ఆయన పేరిట 'నాన్నాగారు' స్వచ్ఛంద సేవా సంస్థ స్థాపించి ఎందరో అనాథలకు అన్నీ తానై సేవలందిస్తున్నారు. తన సేవలను ఆ మండలానికే పరిమితం చేయకుండా పక్కనే ఉన్న వేమూరు, రేపల్లె, బాపట్ల నియోజకవర్గాల పరిధిలోని పలు మండలాలకు విస్తరింపజేశారు. కరోనా సమయంలో చేపట్టిన సేవా కార్యక్రమాలు అనిర్వచనీయం.

ఆహారం అందించి ఆకలి తీర్చారు

గ్రామాల్లో ఉపాధికి దూరమై ఇబ్బంది పడుతున్న కుటుంబాలను గుర్తించి నిత్యం ఆహార పొట్లాలు అందించారు. అనాథలకు అయిన వారిగా మారి ఎంతో మంది ఆకలి తీర్చారు. యాచకులు, వితంతువులు, సంచార జీవులు, రహదారి వెంట జీవనం కొనసాగించే వారికి సైతం అన్నదానం చేసి ఆకలి తీర్చారు. కరోనా సోకి బాధ పడుతున్న బాధితుల ఇళ్లకు ఆహారం అందించడమే కాక కావాల్సిన సామాగ్రిని సైతం సమకూర్చారు.

కరోనా విపత్కర పరిస్థితుల్లో 26 అనాథ శవాలకు దహన సంస్కారాలు నిర్వహించి సేవా నిరతిని చాటుకున్నారు.

నిరాశ్రయులకు అభయం

ఏ దిక్కూ లేని 10 మంది అనాథలను దత్తత తీసుకుని వారి బాధ్యతలను కూడా స్వీకరించారు. కోవిడ్ బారిన పడి ప్రాణాలు కోల్పోయిన వారి పిల్లలకు సత్యన్నారాయణ అన్నీ తానై నిలిచారు. వంగర నాగరాజు అనే అనాథ బాలుడ్ని గత పదేళ్లుగా సర్వం తానై చూసుకుంటున్నారు. ప్రస్తుతం ఆ బాలుడ్ని కావూరులోని హాస్టల్‌లో చేర్పించారు. రిక్షావాలాగా, వల్లకాటిలో కాటి కాపరి పనులు చేయడమే కాక వేలాది మందికి అన్నదానం చేసిన సామాజిక కార్యకర్తగా అందరివాడిగా ప్రతి ఒక్కరి అభినందనలు చూరగొన్నారు. వికలాంగులు, మానసిక వికలాంగులను చేరదీసి వారికి కావాల్సిన సౌకర్యాలు కల్పించి సురక్షిత కేంద్రాలకు తరలిస్తారు. పరుల సేవే పరమాత్ముని సేవగా భావిస్తూ సత్యన్నారాయణ చేపడుతున్న సేవా కార్యక్రమాలు పలువురి ప్రశంసలు అందుకుంటున్నాయి.

ఎవరికి ఏ ఆపద వచ్చినా ముందుంటా

2002 సెప్టెంబర్‌లో నా తండ్రి పొన్నపల్లి వెంకట సుబ్రహ్మణ్యం (దత్తు) పరమపదించారు. పది మందికి ఉపకారం చేయాలనే తలంపుతోనే ఆయన జీవించారు. ఆయన ఆశయాల బాటలో నడవాలని నిర్ణయించుకుని 'నాన్నగారు' స్వచ్ఛంద సంస్థను స్థాపించాను. కుల, మత, వర్గాలకు అతీతంగా సొంత ఖర్చులతో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నాను. నిరంతరం ప్రజా సేవలో ఉంటూ ఎవరికి ఏ ఆపద వచ్చినా ముందుంటా.

–పొన్నపల్లి సత్యన్నారాయణ,
'నాన్నగారు' స్వచ్ఛంద సంస్థ
వ్యవస్థాపకుడు, గుళ్లపల్లి.

కౌలు రైతులకు రుణ అర్హత కార్డులు



పిట్టలవానిపాలెం: అర్హత కలిగిన కౌలు రైతులకు కౌలు రైతు కార్డులు అందజేయాలని బాపట్ల జిల్లా జాయింట్ కలెక్టర్ చామకూరి శ్రీధర్ అధికారులను ఆదేశించారు. మండలంలోని చందోలు గ్రామంలో కౌలు రైతుల అవగాహనా కార్యక్రమంలో గురువారం ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రెవెన్యూ, వ్యవసాయశాఖ సంయుక్తంగా కౌలు రైతులను గుర్తించి వారికి రుణ అర్హత కార్డులు అందించాలని తెలిపారు. రైతులకు రుణ అర్హత కార్డులు అందించారు. బాపట్ల రెవెన్యూ డివిజనల్ అధికారి గంధం రవీందర్ పిట్టువారిపాలెం, ఖాజీపాలెం గ్రామాలలో పర్యటించి కౌలు రైతులకు అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ స్ఫూర్తి, మండల వ్యవసాయాధికారి సత్యానంద్, ఏఈఓ సుదర్శనరావు, ఆర్‌ఐ అమానుల్లాఖాన్, వీఆర్వోలు నాగరాజురెడ్డి, నాగాంజనేయులు, వ్యవసాయశాఖ సిబ్బంది ఉన్నారు.

నేడు తాగునీటి సరఫరాకు అంతరాయం

రేపల్లె రూరల్: వాటర్ సప్లయ్ ప్లాంట్ మరమ్మతుల నేపథ్యంలో పట్టణంలో మున్సిపల్ తాగు నీటిని ఈ నెల 28వ తేదీ శుక్రవారం నిలుపుదల చేస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ శేషాద్రి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణ ప్రజలు ఈ అంశాన్ని గమనించి సహకరించాలని కోరారు.

ఆటో పాయింట్ల బోర్డుల ఏర్పాటుకు అనుమతివ్వండి



మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్‌కు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

బాపట్ల: ఆర్టీసీ బస్సు సౌకర్యం లేని మారుమూల గ్రామాలకు ప్రయాణికులను చేర్చే ఆటోలు నిలుపుకునేందుకు పట్టణంలో ఆటో పాయింట్లకు బోర్డుల సౌకర్యం కల్పించాలని కార్మిక శక్తి ఆటో యూనియన్ జిల్లా అధ్యక్షులు గొలపల పూర్ణచంద్రరావు కోరారు. గురువారం మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్, పట్టణ పోలీసులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పూర్ణచంద్రరావు మాట్లాడుతూ బాపట్ల నియోజకవర్గంలో ఆర్టీసీ బస్సు సౌకర్యం లేని సర్సాయపాలెం, జమ్ములపాలెం, జిల్లెళ్లమూడి, కంకటపాలెం, చెరుకూరు, దేవినూతల, పిన్నిబోయినవారిపాలెం గ్రామాలకు గత 20 ఏళ్లుగా బాపట్ల పట్టణం నుంచి ఆయా గ్రామాలకు ప్రయాణికులను చేరవేస్తూ అనేక మంది ఆటో కార్మికులు ఉపాధి పొందుతున్నారని అన్నారు. గతంలో పైన తెలిపిన గ్రామాల ఆటో పాయింట్లతో పాటు బోర్డులు ఏర్పాటు చేసుకునే విధంగా పోలీసులు అనుమతిచ్చారు. అయితే రహదారుల విస్తరణలో భాగంగా ఆటో పాయింట్ బోర్డులను తొలగించడం జరిగిందన్నారు. గ్రామాల వారీగా ఆయా ప్రాంతాలకు వెళ్లే ఆటో పాయింట్లు బోర్డులను తిరిగి ఏర్పాటు చేసుకునే విధంగా అనుమతి ఇవ్వాలని ఆయన కోరారు. ఆటో కార్మికులు ఎదుర్కొంటున్న ఈ సమస్యను సానుకూలంగా పరిష్కరించి ఆటో పాయింట్ బోర్డులను ఏర్పాటు చేసుకునేందుకు అనుమతి ఇవ్వాలని అధికారులకు అందజేసిన వినతిపత్రంలో పేర్కొన్నట్లు తెలిపారు. వినతిపత్రం అందజేసిన వారిలో యూనియన్ నాయకులు కె.కోటేశ్వరరావు, మార్పు తిరుపతయ్య, ఎం గోపి, ఎస్.కే.మౌలాలి, కే సీయోను, జి.జాన్, పి.ఆదాం, షేక్ మహబూబ్ బాషా, ఖాజావలి, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

నిజాంపట్నంలో రెండు పూరిళ్లు దగ్ధం



అగ్ని ప్రమాదంలో దగ్ధమవుతున్న పూరిళ్లు

నిజాంపట్నం: అగ్ని ప్రమాదంలో రెండు పూరిళ్లు దగ్ధం కాగా కట్టు బట్టలతో కుటుంబ సభ్యులు బయట పడిన సంఘటన మేకావారిపాలెంలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం మండలంలోని అడవులదీవి పంచాయతీ మేకావారిపాలెంలో యేమినేని కోటేశ్వరరావు, మేకా రమణలకు చెందిన పూరిళ్లు బుధవారం అర్ధరాత్రి పూర్తిగా దగ్ధమయ్యాయి. మొదటగా మేకా రమణకు చెందిన పూరింట్లో మంటలు చెలరేగి పక్కనే ఉన్న యేమినేని కోటేశ్వరరావు ఇంటికి వ్యాపించాయి. స్థానికులు మంటలను అదుపు చేసేందుకు ప్రయత్నించినప్పటికీ విఫలం కావటంతో రేపల్లె ఫైర్ సిబ్బందికి సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి అగ్ని మాపక సిబ్బంది చేరుకుని మంటలు అదుపు చేశారు. ఈ ప్రమాదంలో రెండు పూరిళ్లలోని సామాగ్రి పూర్తిగా కాలి బూడిదయ్యాయి. మంటలు వ్యాపించడానికి గల కారణాలు తెలియాల్సి ఉంది. భాధిత కుటుంబాలను స్థానిక సర్పంచ్ కొంతి శ్రీనివాసరావు పరామర్శించి నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. టీడీపీ నాయకులు పరామర్శించి నగదు అందించారు.


సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తం కండి



సిబ్బందికి సూచనలు చేస్తున్న టాస్క్‌ఫోర్స్ కమిటీ సూపర్‌వైజర్ వేణు

రేపల్లె రూరల్: పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ సీజనల్ వ్యాధుల నివారణకు తగు చర్యలు తీసుకోవాలని వైద్యారోగ్యశాఖ బాపట్ల జిల్లా టాస్క్‌ఫోర్స్ కమిటీ సూపర్‌వైజర్ వేణు సూచించారు. మండలంలోని మోళ్లగుంట, పోటుమెరక ఆరోగ్య ఉపకేంద్రాలను గురువారం ఆయన సందర్శించి సిబ్బందితో మాట్లాడారు. ప్రస్తుత వర్షాకాలంలో సీజనల్ వాధులు ప్రబల్లే అవకాశం ఉన్నందున ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. దోమల వ్యాప్తిని నివారించే కార్యక్రమాలలో ప్రజలను భాగస్వాములను చేయాలని తెలిపారు. కార్యక్రమంలో మోళ్లగుంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యుడు సాయి, ఎంపీహెచ్‌ఈవో వైవీ రావు, సూపర్‌వైజర్‌లు లక్ష్మణ్, రంగారావు, ప్రేమకుమారి, ఏఎన్‌ఎంలు విజయలక్ష్మి, కిరణ్మయి, నిర్మల తదితరులు పాల్గొన్నారు.

చేతుల పరిశుభ్రతపై అవగాహన కల్పించాలి



మాట్లాడుతున్న సర్వశిక్షా అభియాన్ ఏఎంవో డాక్టర్ బిల్లా మోజేష్

చెరుకుపల్లి: పాఠశాలల్లో చేతుల పరిశుభ్రత గురించి ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నట్లు సర్వ శిక్షా భియాన్ ఏఎంవో డాక్టర్ బిల్లా మోజేష్ అన్నారు. గురువారం స్థానిక గుళ్లపల్లి జిల్లా పరిషత్ హై స్కూల్‌తో డెటాల్ బనేగా ఇండియా, సర్వ శిక్ష అభియాన్ సంయుక్త ఆధ్వర్యంలో చెరుకుపల్లి, కర్లపాలెం, పిట్టలవానిపాలెం మండలాల నుంచి ఎంపిక చేసిన పాఠశాలల ఉపాధ్యాయులకు నిర్వహించిన ఒక రోజు శిక్షణా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ విద్యా సంవత్సరం జిల్లాలో ఎంపిక చేసిన 103 పాఠశాలల్లో చేతులు పరిశుభ్రత మీద ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. దీని కోసం ఉపాధ్యాయులకు ప్రత్యేకంగా శిక్షణ ఇస్తున్నామన్నారు. ఉపాధ్యాయులు ఈ విషయాలను విద్యార్థులకు సమర్థంగా అవగాహన కల్పించి వారిని ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దాలని తెలిపారు. శిక్షణ పొందిన ఉపాధ్యాయులు పాఠశాలలో వరల్డ్ హ్యాండ్ వాష్ డే, వరల్డ్ టాయిలెట్ డే, మెన్స్ట్రువల్ హైజీన్ డే దినోత్సవాల రోజుల్లో విద్యార్థినీ విద్యార్థులకు వ్యక్తిగత పరిశుభ్రతపై ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలని అన్నారు. కార్యక్రమంలో చెరుకుపల్లి ఎంఈఓలు పులి లాజర్, టి నవీన్, గుళ్లపల్లి జెడ్పీ హైస్కూలు ప్రధానోపాధ్యాయురాలు కోనేటి కవిత, రిసోర్స్ పర్సన్లు రవిరాజు, డెటాల్ బనేగా స్వస్థ ఇండియా ప్రతినిధులు వి భగవాన్, జి నలిని, ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సంగీత విద్వాంసులకు 'గాన విదుషి' స్మారక పురస్కారం

- 'గాన విదుషి' గద్దె వేంకట రామ కుమారి స్మారక అవార్డును అందుకోనున్న విశిష్ట సంగీత విద్వాంసులు పి.జానకి, బీవీ దుర్గాభవాని
- 29న తెనాలిలో రామకుమారి వర్ధంతి సంగీతోత్సవంలో ప్రదానం
- ఇదే వేదికపై వీణా, గాత్రసంగీత కచేరి ఏర్పాటు



పి.జానకి / బీవీ దుర్గాభవాని

తెనాలి: ప్రముఖ సంగీత విద్వాంసురాలు 'గాన విదుషి' గద్దె వేంకట రామకుమారి నవమ వర్ధంతి సంగీతోత్సవం ఈ నెల 29న తెనాలిలో జరగనుంది. పట్టణానికి చెందిన సంగీత సంస్థ హేమాద్రి మ్యూజిక్ అకాడమీ ఆధ్వర్యంలో స్థానిక కొత్తపేటలోని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ హాలులో ఆ రోజు సాయంత్రం 6.15 గంటలకు పి.కనకదుర్గ వీణా కచేరితో వేడుకలు ఆరంభిస్తారు. అనంతరం గద్దె వేంకట రామకుమారి స్మారక అవార్డు–2024ను విశిష్ట సంగీత విద్వాంసులు పి.జానకి, బీవీ దుర్గాభవానిలకు బహూకరిస్తారు. వీరిద్దరూ రామకుమారి ప్రియశిష్యులు కావటం విశేషం. ప్రఖ్యాత వయొలిన్ విద్వాంసుడు 'నాదసుధార్ణవ' డాక్టర్ అన్నవరపు రామస్వామి, గుంటూరులోని గాయత్రి మహిళా సంగీత సన్మండలి కార్యదర్శి ఎం.శేషురాణి ముఖ్య అతిథులుగా పాల్గొంటారు. అవార్డు ప్రదానం తదుపరి బీవీ దుర్గాభవానిచే గాత్ర సంగీత కచేరీ ఉంటుందని నిర్వాహకులు తెలియజేశారు. హేమాద్రి చంద్రకాంత్ వయొలిన్‌పై, కేవీ రామకృష్ణ మృదంగంపై వాద్య సహకారం అందిస్తారు.

గాత్ర విద్వాంసురాలు జానకి..

అవార్డు గ్రహీతల్లో ఒకరైన పి.జానకి సద్గురు శ్రీ త్యాగరాజస్వామి శిష్య పరంపరలో అయిదో తరం వారు. పెదనందిపాడు మండలం రావిపాడు ఈమె స్వస్థలం. రామకుమారి వద్ద ప్రాథమిక విద్య, డాక్టర్ అన్నవరపు రామస్వామి గురువుగా ఉన్నత సంగీత విద్య సాధన చేశారు. విజయవాడలోని జీవీడీ ప్రభుత్వ సంగీత కళాశాలలో 1967–73లో కర్ణాటక గాత్ర సంగీతం డిప్లొమా కోర్సును పూర్తి చేశారు. పిన్న వయసులోనే రాష్ట్ర ప్రభుత్వ సాంస్కృతిక ఉపకార వేతనం అందుకున్నారు. తాను చదువుకున్న విజయవాడ సంగీత కళాశాలలోనే గాత్ర సంగీత అధ్యాపకురాలిగా పనిచేసి, తర్వాత గుంటూరులోని సంగీత కళాశాలకు బదిలీపై వచ్చారు. 2016లో పదవీ విరమణ చేశారు. 2012లో రాష్ట్ర ప్రభుత్వ ఉత్తమ అధ్యాపక అవార్డును స్వీకరించారు. తెలుగు నాటనే కాకుండా ఇతర రాష్ట్రాల్లోనూ అనేక సభల్లో గాత్ర కచేరీలు చేశారు. 1972 నుంచి ఏటా పారుపల్లి రామకృష్ణయ్య పంతులు పాల్గొంటున్నారు. భక్తి ఛానల్‌లో బ్రహ్మోత్సవాలు, నాదనీరాజనంలో తన గానంతో అలరిస్తున్నారు. బీహై ఆర్టిస్టుగా రేడియో, టీవీ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనేక సత్కారాలను అందుకున్నారు.

టాప్‌గ్రేడ్ కర్ణాటక వయొలినిస్ట్ దుర్గాభవాని..

మరొక అవార్డు గ్రహీత బీవీ దుర్గాభవాని వయొలిన్ విద్వాంసురాలు. విజయవాడలో 1965లో సంగీత కుటుంబంలో జన్మించారు. తండ్రి ప్రముఖ హరికథా భాగవతార్. త్యాగరాజ స్వామి పరంపరలోని వారే. డాక్టర్ అన్నవరపు రామస్వామి శిష్యురాలు. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో ఆరేళ్లు వయొలిన్ అధ్యాపకురాలిగా చేశారు. 1994 నుంచి ఆలిండియా రేడియోలో టాప్ గ్రేడ్ కర్ణాటక వయొలినిస్టుగా కొనసాగుతున్నారు. కర్ణాటక వోకల్‌లో, డివోషనల్ వోకల్‌లోనూ బీహై ఆర్టిస్టుగా ఉన్నారు. ఏఐఆర్‌లో అనేక సంగీత కార్యక్రమాలను కంపోజ్ చేసి, నిర్వహించారు. వీటిలో హరికేశ జనని, త్యాగరాజ రామాయణం, గాయక సార్వభౌమ పారుపల్లి రామకృష్ణయ్య పంతులు, ఆదిభట్ల నారాయణదాసు, ఎంఎస్ సుబ్బులక్ష్మి కార్యక్రమాలు ఉన్నాయి. ఉద్యోగంలో చేరకముందే గ్వాలియర్‌లో జరిగిన సౌత్‌సెంట్రల్ జోన్ పోటీల్లో ప్రథమ బహుమతిని గెలిచారు. 2012లో ఉత్తమ అధ్యాపక అవార్డుతో సహా, అనేక అవార్డులు, బిరుదులు అందుకున్నారు. వీటిలో సంగీత విద్వన్మణి, వాయులీన కళానిధి, సునధ సుధానిధి, మధురగాన సరస్వతి, సంగీత కళాకౌముంది వంటివి ఎన్నో. అవార్డు ప్రదానోత్సవ వేళ ఈమె గాత్ర సంగీతాన్ని ఆస్వాదించే అవకాశం, తెనాలి సంగీతాభిమానులకు కలిగింది.

దళిత ఉద్యమ శిఖరం బొజ్జా తారకం

నెహ్రూనగర్: న్యాయ వృత్తినే ఆయుధంగా చేసుకొని ఎస్సీ ఎస్టీ సమస్యలపై పోరాటం చేసిన గొప్ప మేధావి, న్యాయ కోవిదుడు బొజ్జా తారకం అని భీమ్ భారత్ రాష్ట్ర అధ్యక్షుడు పాగళ్ల ప్రకాష్ పేర్కొన్నారు. గురువారం అరండల్ పేటలోని భీమ్ భారత్ కార్యాలయంలో బొజ్జా తారకం 83వ జయంతి సభ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైకోర్టు న్యాయవాదిగా కొనసాగుతూ అంబేద్కర్ ఆలోచన విధానాన్ని రాష్ట్ర మంతా వ్యాపింపజేశారన్నారు. 1985 కారంచేడు దళితుల మారణ హోమానికి నిరసనగా దళిత మహాసభ వ్యవస్థాపక అధ్యక్షుడిగా ఉద్యమ నిర్మాణంలో తన వంతు పోరాటాన్ని కొనసాగించారని గుర్తుచేశారు. డాక్టర్ కత్తి పద్మారావుతో పాటుగా కేజీ సత్యమూర్తి, గద్దర్ లాంటి ప్రముఖ ఉద్యమకారులతో పని చేసి అనేక ఉద్యమాలకు న్యాయపరమైన సలహాలు సూచనలు అందించారని, బాధితులకు అండగా నిలిచిన గొప్ప న్యాయ శిఖరం బొజ్జ తారకం అని కొనియాడారు. పలు సంఘాల నాయకులు ఉగ్గం సాంబశివరావు, సాదు మాల్యాద్రి పాల్గొన్నారు.


ముగిసిన ఇంటింటా ధర్మ ప్రచారం



ఇంటింటా ధర్మ ప్రచారం నిర్వహిస్తున్న ఎస్ఎస్ఎఫ్ నిర్వాహకులు

భట్టిప్రోలు: రాష్ట్ర వ్యాప్తంగా సమరసత సేవా ఫౌండేషన్ (ఎస్ఎస్ఎఫ్) ఆధ్వర్యంలో నిర్వహించిన ఇంటింటా ధర్మ ప్రచారం కార్యక్రమం బాపట్ల జిల్లాలో విజయవంతంగా ముగిసింది. భట్టిప్రోలు, కొల్లూరు, పిట్టలవానిపాలెం మండలాల్లోని ఎస్టీ కాలనీల్లో ఇంటింటా ధర్మ ప్రచారాన్ని నిర్వహించారు. గురువారం భట్టిప్రోలులో బాపట్ల జిల్లా ధర్మ ప్రచారక్ జంజనం హేమశంకరరావు మాట్లాడుతూ హిందూ ధర్మం గొప్పతనాన్ని గూర్చి గ్రామాల్లో ప్రతి ఇంటికి తెలియజేయడం జరిగిందన్నారు. ప్రతి ఇంటికి స్టిక్కర్లు అంటించి హిందూ ధర్మ విశిష్టతను గూర్చి కరపత్రాలు పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో జిల్లా దేవాలయాల ప్రముఖ్ పొన్నపల్లి సత్యన్నారాయణ, పరియోజన ప్రముఖ్ పడమట వెంకటేశ్వరరావు, రేపల్లె ఖండ్ సంయోజక్ క్రాప రవికుమార్, ధర్మ ప్రచారకులు చింతల మురళీకృష్ణ, అక్కల సుబ్బారెడ్డి, కన్వీనర్లు వేల్పూరి శ్రీనివాసరావు, పేరం కోటేశ్వరరావు పాల్గొన్నారు.

ఆక్రమణలు తొలగింపు



తెనాలిఅర్బన్: తెనాలి పట్టణంలోని రోడ్ల వెంట ఉన్న ఆక్రమణలను తొలగించేందుకు మున్సిపల్ అధికారులు చర్యలు చేపట్టారు. దీనిలో భాగంగా గురువారం జిల్లా వైద్యశాల రోడ్డులో ఉన్న ఆక్రమణలు, చెట్ల కొమ్మలను తొలగించారు. బాలాజీరావుపేటలోని గిరి రోడ్డు నందు ఆక్రమణలను తొలగించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ సీటీ ప్లానర్లు సుధాకర్, సుబ్బారావు, త్రీటౌన్ పోలీసులు, టౌన్ ప్లానింగ్, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

పృథువు పుణ్య చరిత్ర చదివితే శుభాలు



నగరంపాలెం: స్థానిక బృందావన్ గార్డెన్స్‌లోని శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయ ప్రాంగణంలో ఉన్న అన్నమయ్య కళా వేదికపై రెండు రోజుల తిరుప్పావై అమృత వర్షిణి డాక్టర్ కోగంటి వెంకట శ్రీరంగ నాయకి ప్రబంధ సాహిత్యం ఆధ్యాత్మిక ప్రవచనాలు గురువారం మొదలయ్యాయి. ఆలయ అధ్యక్షుడు సీహెచ్ మస్తానయ్య జ్యోతి ప్రజ్వలన చేసి, కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వెంకట శ్రీరంగనాయకి ప్రసంగిస్తూ పృథువు పుట్టుక అయోనిజమైనదన్నారు. పృథు మహారాజు మహా వైభవంగా 99 అశ్వమేథాలు పూర్తి చేసి, వందవ యాగాన్ని ప్రారంభించి యజ్ఞేశ్వరుడైన శ్రీహరిని ఆరాధించారని తెలిపారు. దీనిని చూసి ఇంద్రునికి అసూయ కలిగి.. మాయా వేషంతో యజ్ఞపశువును అపహరించి ఆకాశ మార్గాన వెళ్లారన్నారు. ఈ విషయాన్ని అత్రి మహాముని పృథు చక్రవర్తి కుమారునికి చెప్పగా, ఆయన కోపంతో ఆకాశంలోని ఇంద్రునిపైకి దుమికాడన్నారన్నారు. ఇంద్రుడు దొంగ వేషాన్నీ, గుర్రాన్ని విడిచి పారిపోయాడన్నారు. పృథు పరాక్రమానికి మెచ్చిన మునులు అతనికి 'జితాశ్వుడు'గా నామకరణం చేశారని వివరించారు.